క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రీ సుదర్శన్ మహాహోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రారంభమైన శ్రీ సుదర్శన్ మహాహోమం కొనసాగుతోంది. ఆలయంలో శనివారం పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా పూజలు జరిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు హోమాన్ని జరుపుతున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి సెక్రటరీ వెంకటేశ్వరావు, భక్తులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఈ క్రాప్ ఈకెవైసీ చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు

తెనాలిటౌన్: రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఈ నెలాఖరులోపు ఈ క్రాప్ ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. రూరల్ మండలం ఎరుకలపూడి పొలాల్లో చేస్తున్న ఈకేవైసీని శనివారం పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్బీకెలలో ఎరువులను ఎక్కువగా రైతులకు విక్రయించాలని అధికారులను ఆదేశించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు త్వరగా మీ సేవ కేంద్రాల ద్వారా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్, ఏఈవో మోహన్, వీఏఏలు మణిదీపిక, వాణి, మౌనిక, ఎరుకలపూడి సర్పంచ్ చందు శాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ కుమార్ పంపుల కాలనీకి చెందిన గోరంట్ల సాంబశివరావు(50) గతంలో స్టీలు కంపెనీలో పని చేసేవాడు. కొంత కాలంగా చిన్న టిఫిన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కుంచనపల్లి సర్వీస్‌రోడ్‌ను వెంటనే పూర్తిచేయాలి

తాడేపల్లిరూరల్: జాతీయ రహదారి నుంచి కుంచనపల్లి గ్రామంలోకి వెళ్లే సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావుతో కలసి అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌రోడ్‌ను శనివారం పరిశీలించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో కుంచనపల్లి, వడ్డేశ్వరం, మెల్లెంపూడి తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తాయని అన్నారు. జాతీయ రహదారి అధికారులు రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో గుంతలు పడి, వర్షాలు కురిసినపుడు ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నామన్నారు. తక్షణం అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ముగిసిన విద్యుత్ వినియోగదారుల అదాలత్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. అమరావతి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.వి. తులసిరామ్ మాట్లాడుతూ ఈ సదస్సులో మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 15 అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన రెండు ఫిర్యాదులు 15 రోజులలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదాలత్‌లో విద్యుత్ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ పరిశీలకులు, జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. తెనాలి పట్టణంలోని 12వ సచివాలయంలో శనివారం ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లోని సభ్యుల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. అలాగే వారికి ఏమైనా దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే వాటికి సంబంధించిన పరీక్షలు చేయడంతో పాటు మందులు కూడా ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో వాటిని నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి డి.రాజునాయక్, సబ్ యూనిట్ అధికారి శివగణేష్, తెనాలి అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, ప్రసాద్, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష



తూములూరు గ్రామ సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

తూములూరు(కొల్లిపర): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని తూములూరు గ్రామంలో గ్రామ సచివాలయంలో వలంటీర్లు, హెల్త్ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది సర్వే గురించి అవగాహన కల్పించి శనివారం సర్వే ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని వలంటీర్లు, హెల్త్ సెక్రటరీలు ఎటువంటి తారతమ్యం లేకుండా ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్షలో చేపట్టే ఎనిమిది రకాల పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ గురించి, అలాగే 30 నుంచి గ్రామంలో ప్రారంభమయ్యే ఆరోగ్య శిబిరాల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, పరిపాలనాధికారి వి.చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఓజోన్ దినోత్సవం

తెనాలి: స్థానిక నెహ్రూ నికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో శనివారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. చెట్లను పెంచటం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి ధరిత్రిని కాపాడుకోవచ్చని తెలియజేసేలా చిన్నారులు భూగోళం నమూనా గ్లోబును, మొక్కలు, ఆకాశం చిత్రపటాలను ప్రదర్శించారు. 'ఓజోన్‌ను పరిరక్షించండి...ధరిత్రిని కాపాడండి' అంటూ నినాదాలు చేశారు. ఓజోన్ పొర క్షీణించటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి మాట్లాడుతూ సూర్యుడి నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాలు భూమిపై నేరుగా పడితే సకల జీవరాశి మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని చెప్పారు. అలా జరకుండా భూమి చుట్టూ వాతావరణంలో ఉండే ఓజోన్ పొర మనందరిని కాపాడుతోందని చెప్పారు. భూతాపం పెరిగినా, వర్షాలు కురవకున్నా, అడవులు తగ్గిపోయినా, కాలుష్యం పెరిగినా...అవన్నీ ఓజోన్ పొరను దెబ్బ తీస్తాయని చెప్పారు. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, స్ట్రాలు...వంటి ఒకసారి వాడి పారేసే వాటిని ఎంతగా తగ్గిస్తే ఓజోన్‌కు అంతగా మేలు జరుగుతుందని వివరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



చిత్రపటాలను ప్రదర్శించిన చిన్నారులు

తెనాలిఅర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సి బాధ్యత అందరిపై ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ విద్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో చినరావూరుతోటలోని ఏజీకె పురపాలక పాఠశాలలో శనివారం విద్యార్థులతో మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థుల్లో పుస్తకపఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు నీతి కథల పుస్తకాలను చదివించడం, కథలు చెప్పించడం, బొమ్మలు గీయించడం వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భీమవరపు శివరామకృష్ణ, నవ్య, హెచ్ఎం టి.రాంబాబు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చెత్తరహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిదుద్దాం

తెనాలిఅర్బన్: చెత్త రహిత పట్టణంగా తెనాలికి తీర్చిదిద్దేందుకు అందరూ ప్రయత్నించాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ సూచించారు. మినిస్ట్రీస్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ వారి సూచనల మేరకు ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ పట్టణ ప్రజలను, యువతను స్వచ్ఛంద సంస్థలను దీనిలో భాగస్వాములుగా చేయాలని సూచించినట్లు చెప్పారు. మూడుబుట్టల విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు ఎస్.ప్రవీణ్‌కుమార్, డి.సాగరయ్య, ఎం.శాంతి, ప్రియదర్శిని, కె.సంధ్య, జి.చంద్రశేఖర్, వై.నాగమల్లేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, జి.ప్రవీణ కుమారి, పి.శాంతకుమారి, కె.శ్రీనాథ్, కె.సురేష్, నగరదీపికలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నెహ్రూనికేతన్ ఎండీ మురళీకాంత్, మున్సిపల్ సిబ్బంది

తెనాలిలో 'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

తెనాలిఅర్బన్: రోజు వారి కూలీలు, పేద ప్రజలకు ప్రతి రోజూ తక్కువ ధరకే రుచికరమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన రుచి, సుచికరమైన ఆహారాలను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పేద ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీటీ మిషన్ మేనేజర్ వి.మాధవరావు, సీహెచ్.అరుణకుమారి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.



క్యాంటీన్ ప్రారంభిస్తున్న కమిషనర్ జశ్వంతరావు

మట్టి వినాయక ప్రతిమలను ఉపయోగించండి



ఉద్యోగులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కమిషనర్ జశ్వంతరావు



గణపతి మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలిఅర్బన్: వినాయక చవితికి వేడుకలకు మట్టి వినాయక ప్రతిమలను అందరూ ఉపయోగించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సూచించారు. తెనాలి డబల్ హార్స్ మినపగుళ్ల సంస్థ ఎండీ మోహన్‌శ్యామ్‌ప్రసాద్ సహకారంతో మున్సిపల్ ఉద్యోగులకు శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కెమికల్‌తో తయారుచేసిన రంగు రంగుల ప్రతిమలను వాడటం వలన శ్వాసకోస వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ ఎం.అప్పలరాజు, మున్సిపల్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు ఆకురాతి రామచంద్రరావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

గణపతి మట్టి ప్రతిమల పంపిణీ

మున్నంగి(కొల్లిపర): వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల విద్యార్థులకు మట్టి విగ్రహాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, భార్గవి, ఓలేటి లక్ష్మి పాల్గొన్నారు.

కమిషనర్ జశ్వంతరావు

రెయిన్‌బోలో వినాయక చవితి వేడుకలు

తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేటలోని రెయిన్‌బో ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను శనివారం నిర్వహించారు. వినాయకునికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు వినాయక ప్రతిమల తయారీ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ సాయిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెస్ట్‌బెర్రీ పాఠశాలలో గణేష్ ప్రతిమల పోటీ

తెనాలిటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి గణేష్ ప్రతిమల తయారీ ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి పాఠశాలలో వినాయకచవితి పండుగను పురస్కరించుకుని శనివారం తల్లిదండ్రులు పిల్లలతో కలసి గణేష్ ప్రతిమల తయారు చేసే పోటీ నిర్వహించారు. తల్లిదండ్రులు, పిల్లలు కలసి ప్రతిమలు తయారు చేశారు. ప్రీప్రైమరీ, ప్రైమరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ విభాగాలలో విజేతలను ప్రకటించారు. న్యాయనిర్ణేతలుగా రవిచంద్ర, బోసుబాబు, హేమంత్‌కుమార్ వ్యవహరించి ప్రతిమలను పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపల్ టి.వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికితీసే విధంగా, దైవభక్తిని చిన్నప్పటి నుంచి అలవాటు చేసేందుకు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేష్ ప్రతిమల పోటీ నిర్వహించామన్నారు. విజేతలకు తహసీల్దార్ రవిబాబు, ప్రిన్సిపల్ సుబ్రమణ్యంలు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్లు, బి.డి.ఎం, ఏవో, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు
- జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, డీఎంహెచ్ఓ ఎ శ్రావణ్‌బాబు

మంగళగిరి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే విద్య, వైద్యరంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. యావత్ భారత దేశం రాష్ట్రం వైపు చూసేలా సుపరిపాలన అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన విద్య, వైద్యం అందించాలన్న అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన అందిండం జరుగుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్య, వైద్య వ్యవస్థకు ప్రభుత్వం వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఆరోగ్యశాఖకు సంబంధించి భారీస్థాయిలో నియామకాలు జరిగాయని, ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించడంతోపాటు శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులకు పంపాలన్నారు. రానున్న 15 రోజుల్లో నిర్వహించి ఇంటింటా సర్వే కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. టీబీ రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శిరీష, డీఎంహెచ్ఓ ఎ శ్రావణ్‌బాబు, డీపీఎంఓ సీహెచ్ రత్నమన్మోహన్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బి లక్ష్మానాయక్, ఎన్‌టీబీపీ జిల్లా కోఆర్డినేటర్ వి రాజశేఖరం, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వీఎస్ఆర్ శాస్త్రి, కమిషనర్ యు శారదాదేవిలతో పాటు యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత ఉద్యమ శిఖరం బొజ్జ తారకం



బొజ్జ తారకం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

నెహ్రూనగర్: దళిత ఉద్యమ శిఖరం బొజ్జ తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ అన్నారు. అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో శనివారం బొజ్జ తారకం ఏడో వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాష్ మాట్లాడుతూ నిరంతరం దళిత హక్కుల పరిరక్షణ కోసం తారకం పాటుపడ్డారన్నారు.జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలను అణగారిన కులాలకు చేరువచేసిన ఉద్యమ శిఖరం అని పేర్కొన్నారు. తరతరాలుగా అసమానతలు, అవమానాలతో బాధింపబడ్డ ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు న్యాయవాద వృత్తినే ఆయుధంగా చేసుకొని, రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని సాధించేందుకు నిరంతరం శ్రమించారని కొనియాడారు. బొజ్జ తారకం ఆశయాల్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి



ఆహార నిపుణురాలికి జ్ఞాపిక అందజేస్తున్న మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు స్థూలకాయం, షుగర్ వ్యాధిపై మహిళా అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఆధునిక కాలంలో వచ్చిన ఆహారపు అలవాట్ల వలన స్థూలకాయంతో పాటు ఎక్కువ సంఖ్యలో చక్కెర వ్యాధితో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు మహిళా అభివృద్ధి సెల్ కమిటీ సభ్యులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, కార్యదర్శి కోనేరు శివకాంచనలత, వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్, మహిళా అభివృద్ధి సెల్ కో కన్వీనర్లు డాక్టర్ కె.సోని, ఎస్.శ్రీలక్ష్మి, మహిళా అభివృద్ధి సెల్ కో ఆర్డినేటర్ కోనేరు శిరీష, యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుకీర్తి పాల్గొన్నారు.

చదరంగంలో కేఎల్‌యూ విద్యార్థినికి బంగారు పతకం



మౌనిక అక్షయ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని చదరంగం పోటీల్లో రెండు పతకాలు సాధించినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 15వరకు జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో టాటా స్టీల్ సంస్థ నిర్వహించిన ఏషియల్ జూనియర్ బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్‌లో తమ విశ్వవిద్యాలయంలో సీఎస్‌ఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న బొమ్మిని మౌనిక అక్షయ ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుందని తెలిపారు. ఆసియా జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్ 2023లో మౌనిక అక్షయ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నట్లు వివరించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావులు అక్షయను అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాక సురేష్

మంగళగిరి: ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపాక సురేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీల ఎంపీలు పార్లమెంటులో వర్గీకరణపై మాట్లాడి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ చేస్తే మాదిగలలో బీజేపీ చిరస్థాయిగా నిలుస్తుందని, లేదంటే మాదిగ ద్రోహిగా మిగిలిపోతుందని అన్నారు. వర్గీకరణకు సహకరించకుంటే మాదిగల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, కలకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, నతానియేలు, గుండిమెడ నాగేంద్రం, భాస్కర్, రాజేష్, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం రానున్న పార్లమెంట్ సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ అమరావతి రాజధాని పర్యవేక్షకులు మల్లవరపు నాగయ్య డిమాండ్ చేశారు. తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించకుంటే ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు స్పందించి బిల్లుకు సహకరించాలని ఆయన కోరారు.

తాడేపల్లిలోని క్రిస్టియన్‌పేటలో చిలక సాంబయ్య భూమిని కొంతమంది కబ్జా చేశారని, దళితుడైన సాంబయ్యకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని అన్నారు.

సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కనుకూర్తి నవీన్, అల్లి అచ్చయ్య, చిలక సాంబయ్య, రామలింగేశ్వరరావు, కొడాలి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యం



దుగ్గిరాలలో విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని, విద్యార్థుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాప్ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలకు ఆట వస్తువులను అందజేస్తోంది. దుగ్గిరాల గ్రామంలో ఉన్న బాలుర, బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలకు శనివారం ఆట వస్తువులు అందజేశారు. ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి పాఠశాలలోను, వాలీబాల్, క్రికెట్, చెస్, కేరమ్స్, బ్యాడ్మింటన్ తదితర ఆట వస్తువులను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు శాప్ డైరెక్టర్ శైలజ, ఎంఈఓ శ్రీనివాసరావు, దుగ్గిరాల బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేడికొండూరు: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సిద్ధిక్ అన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్, 104 ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.